

ఖరీఫ్ మిగులు ధాన్యం సేకరణ ప్రారంభం

ముదినేపల్లి : ఖరీఫ్ 2024లో సాగుచేసిన మిగులు వరి ధాన్యం సేకరణ మండలంలో ప్రారంభమైంది. సుమారు 645 మెట్రిక్ టన్నుల ధాన్యం మండలంలోని ఎనిమిది రైతు సేవా కేంద్రాల పరిధిలో గల రైతుల వద్ద మిగిలి ఉంది. వినుము కోతల అనంతరం పరిస్థితులు నూర్పిన వారికి ఇప్పుడు ధాన్యం అమ్ముకొనుటకు ఎంఎల్ఎ డాక్టర్ కామినేని శ్రీనివాసరావు కృషితో జాయింట్ కలెక్టర్ అనుమతి ఇచ్చినందుకు రైతులు తమ సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు. కైకలూరు నియోజకవర్గం మొత్తం మీద సుమారు 47,144 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని 29 రైతు సేవా కేంద్రాల పరిధిలో 7,648 మంది రైతుల వద్ద నుంచి కొనుగోలు చేయగా రూ.108.4 కోట్లు రైతుల ఖాతాలో ఇప్పటి వరకు జమ చేయబడింది. ఈ సందర్భంగా మంగళవారం మండలంలోని గురజ గ్రామ రైతు సేవా కేంద్రంలో ప్రొక్యూర్‌మెంట్ సెంటర్‌లో ధాన్యం కొనుగోలు ప్రక్రియను మండలవ్యవసాయ సహాయ వ్యవసాయ సంచాలకులు జి.వెంకటమణి పరిశీలించారు. గ్రామం నుంచి మిల్లులకు ధాన్యం తోలుతున్న రైతులతో మాట్లాడారు. రైతులు సంతోషం వ్యక్తం చేశారు.

అడవి బిడ్డలంటే అంత అలుసా..!

గిరిజనుల సమస్యలు పట్టని అధికారులు, ప్రజాప్రతినిధులు

ఐదేళ్లయినా బుట్టాయగూడెంలో పూర్తికాని మల్టీస్పెషాలిటీ హాస్పటల్

వైద్యం కోసం ఏజెన్సీ ప్రాంత ప్రజల అవస్థలు వర్ణనాతీతం

జల్లేరువాగుపై పట్టెన్నపాలెం వంతెన నిర్మాణం పూర్తయ్యేదెప్పుడో

సమస్యలపై ఇన్‌ఛార్జి మంత్రిని కలిసేందుకు పోలీసుల ఆంక్షలు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఏజెన్సీ ప్రజల సమస్యలు ప్రభుత్వానికి పట్టడం లేదు. ప్రజలకు ప్రయోజనం చేకూరే పనుల పట్ల జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోని పరిస్థితి ఉంది. దీంతో ఏజెన్సీలో చేపట్టిన అభివృద్ధి పనులు ఏళ్లు గడుస్తున్నా 'ఎక్కడ వేసిన గొంగళి అక్కడే' అన్నట్లు తయారయ్యాయి. తమ సమస్యలను చెప్పుకునేందుకు బుట్టాయగూడెం, జీలుగుమిల్లి మండలాల్లో పర్యటిస్తున్న జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి నాదెండ్ల మనోహర్‌ను కలిసేందుకు సైతం వెళ్లకుండా పోలీసులు పెడుతున్న ఆంక్షలు కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర ఆగ్రహం తెప్పిస్తున్నాయి. ఏజెన్సీ ప్రజలు సరైన వైద్యం అందక నానా ఇబ్బందులు పడుతున్నారు. చిన్నపాటి అనారోగ్యం వచ్చినా జంగారెడ్డిగూడెం, జిల్లా కేంద్రం ఏలూరుకు పరుగులు తీయాల్సిన పరిస్థితులు కొనసాగుతున్నాయి. ఏజెన్సీ ప్రజల నుంచి తీవ్ర నిరసన రావడంతో 2020 అక్టోబర్ రెండో తేదీన బుట్టాయగూడెంలో మల్టీ స్పెషాలిటీ హాస్పటల్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. మొత్తం రూ.49.26 కోట్లు అంచనా వ్యయంతో ఆసుపత్రి నిర్మాణానికి ప్రభుత్వం ఆమోద ముద్ర వేసింది. శంకుస్థాపన చేసినప్పటికీ గత ప్రభుత్వం సరిగా పట్టించుకోని పరిస్థితి ఏర్పడింది. దీంతో మొదటి అంతస్తు శ్లాబ్ వరకూ మాత్రమే పనులు పూర్తయ్యాయి. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది గడుస్తున్నా ఇప్పటికీ బుట్టాయగూడెంలోని మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణంపై దృష్టి సారించని పరిస్థితి నెలకొంది. ఇప్పటికే సరైన రోడ్లు లేక, తాగునీరు లేక ఏజెన్సీలోని గిరిజనులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సరైన వైద్యం అందించేందుకు సైతం ప్రభుత్వం పట్టించుకోకపోవడంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. త్వరితగతిన మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణం పూర్తి చేయాలని ఏజెన్సీ ప్రజలు కోరుతున్నారు.



నిర్మాణ దశలోనే బుట్టాయగూడెంలో మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి భవనం

ఏళ్లు గడుస్తున్నా పూర్తికాని జల్లేరు వాగుపై వంతెన

బుట్టాయగూడెం మండలంలోని పట్టెన్నపాలెం, రామారావుపేట సెంటర్ మధ్య జల్లేరు వాగుపై 2018లో టిడిపి ప్రభుత్వ హయాంలో రూ.ఐదు కోట్ల అంచనా వ్యయంతో హైలెవల్ వంతెన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. 50 శాతం పనులు పూర్తయ్యాయి. తర్వాత వచ్చిన వైసిపి ప్రభుత్వం ఈ వంతెన పనులను పూర్తిగా పక్కన పెట్టేసింది. దీంతో ఇప్పటికీ వంతెన అసంపూర్తిగానే ఉండిపోయింది. రెడ్డిగణపవరం, బెడదనూరు, వెలుతూరువారిగూడెం, జగ్గిశెట్టిగూడెం, నాగులగూడెం, అంతర్వేదిగూడెం, కామవరం, పూచికపాడు, అంకన్నగూడెం వంటి పలు గిరిజన గ్రామాల ప్రజలు ఈ మార్గంలోనే జంగారెడ్డిగూడెం రాకపోకలు సాగించాలి. వంతెన పూర్తికాకపోవడంతో వర్షాకాలం వస్తే ఆ మార్గంలో ప్రయాణం చేయలేని పరిస్థితి ఉండటంతో బుట్టాయగూడెం మీదుగా జంగారెడ్డిగూడెం వెళ్లాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో దూరం భారం పెరిగి జనం నానావస్థలు పడుతున్నారు. ఈ వంతెన నిర్మాణం పూర్తికాక ఏజెన్సీ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా అధికారులకుగాని, ప్రజాప్రతినిధులకుగాని పట్టని పరిస్థితి. వంతెన నిర్మాణం త్వరగా పూర్తిచేయాలని అక్కడి ప్రజలు కోరుతున్నారు.

మంత్రిని కలిసేందుకు సైతం ఆంక్షలు, నిర్బంధాలు


సిఎం, మంత్రుల పర్యటన నేపథ్యంలో జిల్లా పోలీసులు వ్యవహరిస్తున్న తీరు కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి. వైసిపి ప్రభుత్వంలో కొనసాగిన నిర్బంధకాండను ఇప్పటికీ పోలీసులు కొనసాగిస్తున్నారు. గతంలో సిఎం పర్యటన నేపథ్యంలో ప్రజాసంఘాలు, వివిధ పార్టీల నాయకులపై పోలీసులు నిర్బంధం ప్రయోగించేవారు. వైసిపి ప్రభుత్వంలో ఇది తారాస్థాయికి చేరడంతో జనంలో తీవ్ర ఆగ్రహం పెల్లుబుకింది. దీంతో తాము అధికారంలోకి వస్తే ఎటువంటి ఆంక్షలూ ఉండవని కూటమి నేతలు ఎన్నికల్లో పదేపదే చెప్పారు. ఇప్పుడు మంత్రుల పర్యటనలకు సైతం పోలీసులు నిర్బంధం ప్రయోగించడంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రాబోయే కాలంలో ఎంఎల్ఎ వద్దకు సైతం ప్రజలు తమ సమస్యలు చెప్పుకునేందుకు వెళ్లకుండా అడ్డుకుంటారా అనే చర్చ సాగుతోంది. జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి నాదెండ్ల మనోహర్ ఏజెన్సీ ప్రాంతం బుట్టాయగూడెం, జీలుగుమిల్లి మండలాల్లో మంగళ, బుధవారాల్లో పర్యటిస్తున్నారు. జల్లేరుపై వంతెన నిర్మాణం, మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి, ప్రత్యేక డిఎస్‌సి, భూముల సమస్యలను మంత్రికి చెప్పుకోవాలని అక్కడి ప్రజలు, పలు ప్రజాసంఘాలు చూడగా పోలీసులు ఆంక్షలు విధించిన పరిస్థితి ఉంది. మంత్రిని కలిసేందుకు ఇతర గ్రామాల ప్రజలు, ప్రజాసంఘాల నాయకులు రాకూడదంటూ హెచ్చరికలు జారీ చేయడం చర్చనీయాంశమైంది. విషయం మంత్రి దృష్టికి వెళ్లడంతో పోలీసులు కొంత వెనక్కి తగ్గినట్లు తెలుస్తోంది.

అధైర్య పడకండి.. అండగా ఉంటాం

నిర్వాసితులతో జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి నాదెండ్ల మనోహర్

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

'అధైర్య పడకండి అండగా ఉంటాం' అని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి నాదెండ్ల మనోహర్ నిర్వాసితులకు హామీ ఇచ్చారు. మండలంలోని కట్కూరు, ఎర్రవరం పునరావాస కాలనీల్లో ఆయన మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా నిర్వాసితుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ భవిష్యత్‌లో రైతాంగానికి, ప్రజలకు నీటి ఎద్దడి రాకుండా పోలవరం ప్రాజెక్టు నిర్మాణాన్ని చేపట్టామన్నారు. నిర్వాసితుల సమస్యలు పరిష్కరించి, కాలనీల్లో మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకుంటామన్నారు. వేసవిలో తాగునీటికి ఇబ్బంది లేకుండా రక్షిత మంచి నీటిపథకం ఏర్పాటు చేయాలని కలెక్టర్, ఐటిడిఎ పిఒను ఆదేశించారు. ప్రతి గ్రామంలో అంగన్వాడీ, పాఠశాల ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. నిర్వాసిత కాలనీల్లో ఉంటున్న ప్రతి కుటుంబానికీ ఉచితంగా 35 కేజీల బియ్యం ఇచ్చేందుకుగాను ఎఎవై కార్డులు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. వచ్చే జూన్ నాటికి మధ్యాహ్న భోజనంలో సన్న బియ్యంతో పోషకాహారం అందించేలా చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం లబ్ధిదారులకు అంత్యోదయ అన్న యోజన కార్డులు పంపిణీ చేశారు. ఎంఎల్ఎ చిర్రి బాలరాజు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం నిర్వాసితులకు అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ట్రైకార్ ఛైర్మన్ బోరగం శ్రీనివాస్, ఉంగుటూరు ఎంఎల్ఎ పత్సమట్ల ధర్మరాజు, సివిల్ సప్లయిస్ కమిషనర్ సౌరబ్‌గౌర్, కలెక్టర్ వెట్రిసెల్వి, జాయింట్ కలెక్టర్ ధాత్రిరెడ్డి, జనసేన పార్టీ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు కొటికలపూడి గోవిందరావు, ఆర్‌టిసి రీజనల్ ఛైర్మన్ రెడ్డి అప్పల నాయుడు, జనసేన నేతలు ఘంటసాల వెంకటలక్ష్మి, కరాటం సాయి, గడ్డమణుగు రవి, మేకా ఈశ్వరయ్య, ఎస్.సాయి, పి.రాము, కూటమి నేతలు పాల్గొన్నారు.



జీలుగుమిల్లి: ఎఎవై కార్డులు అందిస్తున్న మంత్రి

బుట్టాయగూడెం: నిర్వాసిత కుటుంబాల్లో యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రత్యేకజాబ్ మేళాలు నిర్వహిస్తామని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ చెప్పారు. మంగళవారం రెడ్డిగణపవరం సమీపంలోని పల్లపూరు, రౌతుగూడెంల్లోని నిర్వాసితుల కాలనీలను మంత్రి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు పరిశ్రమల ఏర్పాటుకు చేయూతనిస్తామన్నారు. నిర్వాసితులను ప్రభుత్వం అన్నివిధాలా ఆదుకుంటుందని స్పష్టం చేశారు. అర్హులకు, కొత్తగా వివాహమైన వారికి త్వరలో రేషన్ కార్డులు అందిస్తామన్నారు. ఈ నెలాఖరుకు ఇకెవైసి ప్రక్రియ పూర్తవుతుందని, ఆ పిదప కొత్తరేషన్ కార్డుల జారీకి తగు చర్యలు తీసుకుంటామన్నారు. కాలనీల్లో ఐదు సంవత్సరాలు దాటి పాడైన ఇళ్లకు మరమ్మతులు చేపట్టేందుకు సర్వే చేసి వివరాలు ప్రతిపాదిస్తే మరమ్మతులకు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులతోపాటు ఆర్‌డిఒ ఎంవి.రమణ, తహశీల్దార్ అచ్యుత్ తదితరులు పాల్గొన్నారు.

నృత్యం చేసిన మంత్రి, ఎంఎల్ఎ

మంత్రి నాదెండ్ల మనోహర్‌కు గిరిజనులు సాంప్రదాయ నృత్యాలతో స్వాగతం పలికారు. మంత్రి, ఎంఎల్ఎ సైతం కొమ్ములు ధరించి వారితో కలిసి నృత్యం చేశారు.

బకాయి వేతనాలు విడుదల చేయాలి

వ్యకాస ఆధ్వర్యాన ధర్నాలు

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

మండలంలో ఉపాధి కూలీలకు ఎనిమిది నుంచి తొమ్మిది వారాలుగా ఇవ్వాల్సిన ఉపాధి బకాయిలను వెంటనే విడుదల చేయాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో స్థానిక ఎంపిడిఒ కార్యాలయం వద్ద మంగళవారం ధర్నా నిర్వహించారు. అనంతరం కార్యాలయ ఎఒ మంగతాయారుకు వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా సంఘం మండల కార్యదర్శి కారం నాగదుర్గ మాట్లాడుతూ మండలంలో ఉపాధి కూలీలకు వేతనాలు ఇవ్వకుండా కూటమి ప్రభుత్వం పస్తులుంచుతుందని విమర్శించారు. తక్షణమే బకాయి వేతనాలను ఇవ్వాలని డిమాండ్ చేశారు. అదే విధంగా పని ప్రదేశాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని, పే స్లిప్‌లు ఇవ్వాలని, వేసవిలో ఇచ్చే మజ్జిగ, మౌలిక వసతులు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు తెల్లం దుర్గారావు, వెంకట్రావు, సిరిబత్తుల సీతారామయ్య, మల్లు దొర, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

టి.నర్సాపురం: ఉపాధి కూలీల బకాయి వేతనాలు వెంటనే విడుదల చేయాలని కోరుతూ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయం వద్ద కూలీలతో కలిసి ధర్నా నిర్వహించారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఎంపిడిఒ జి.మణికుమారికి అందజేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా నేత గుడెల్లి వెంకట్రావు మాట్లాడుతూ ఉపాధి హామీ కూలీలకు బకాయిలు ఇవ్వకపోగా రామమ్మగూడెం, సాలిగూడెం, అప్పలరాజుగూడెం, ప్రకాష్‌నగర్ గ్రామాల్లో ఉపాధి పనులు కోరుతున్నప్పటికీ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని విమర్శించారు. పని అడిగిన వారికి వెంటనే పని చూపించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఉపాధి కూలీలు, నేతలు మడకం కుమారి, శిరీష, బేబీ, దుర్గమ్మ, పులి కృష్ణమ్మ, ముత్యాలమ్మ, గీత, వేమన చెల్లమ్మ పాల్గొన్నారు.



టి.నర్సాపురంలో వినతి అందించిన కూలీలు



జీలుగుమిల్లిలో..

మట్టి మాఫియా ఆగడాలను అరికట్టాలి: సిపిఎం

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

జిల్లాలో మట్టి మాఫియా ఆగడాలను అరికట్టాలని, దీనిపై రెవెన్యూ, పోలీస్ అధికారులు తగు చర్యలు తీసుకోవాలని సిపిఎం ఏలూరు జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎ.రవి మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. దెందులూరులో మట్టి మాఫియా యథేచ్ఛగా మట్టిని తవ్వి రూ.కోట్లు సంపాదిస్తున్నారని, అడ్డు వచ్చిన వారిపై దౌర్జన్యం చేస్తున్నారని పేర్కొన్నారు. మంగళగిరిలోని టిడిపి రాష్ట్ర కార్యాలయంలో జరిగిన సంఘటనపై ఉన్నతాధికారులు విచారణ జరిపి నిజాలను బయట పెట్టాలని, అవసరమైతే ముఖ్యమంత్రి ఈ విషయంలో జోక్యం చేసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. మట్టి మాఫియాను అడ్డుకోవాలని, ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా పోలీసులు కఠినంగా వ్యవహరించాలని ఆయన డిమాండ్ చేశారు.

విద్యాభివృద్ధిలో గ్రామీణ కళాశాలల పాత్ర అభినందనీయం

మంత్రి కొలుసు పార్థసారథి

నూజివీడు టౌన్ : తక్కువ ఫీజులతో గ్రామీణ ప్రాంతాలలో విద్యాసంస్థలను నిర్వహిస్తున్న వారు చేస్తున్న సేవలు అభినందనీయమని గృహనిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. స్థానిక శ్రీసిద్ధార్థ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ విద్యను అభ్యసించి మంచి మార్కులు సాధించిన విద్యార్థులను ఆయన తన కార్యాలయంలో అభినందించారు. జెఇఇ మెయిన్స్ 2025లో 97.69 పర్సంటేజ్ సాధించిన అరవ మదునయ్, ద్వితీయ ఇంటర్ ఎంపిసి గ్రూపులో 989 మార్కులు సాధించిన పి.ఆకాంక్ష, ప్రథమ ఇంటర్ ఎంపిసి గ్రూపులో 465 మార్కులు సాధించిన జి.పూజిత, ద్వితీయ సిఇసిలో 965 మార్కులు సాధించిన పి.వెంకన్న బాబులను అభినందించారు. ఈ కార్యక్రమంలో శ్రీసిద్ధార్థ జూనియర్ కళాశాల డైరెక్టర్ గొల్లపూడి రవిబాబు, ప్రిన్సిపల్ జి.శ్రీమన్నారాయణ, టి.అనోజ్ కుమార్, ప్రభుత్వాసుపత్రి డెవలప్మెంట్ కమిటీ మెంబర్ ఇళయరాజా, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మేడే వాడవాడలా నిర్వహించాలి

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి డివిఎన్‌విడి.ప్రసాద్

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ప్రపంచ కార్మిక దినోత్సవం మేడేను వాడవాడలా ఘనంగా నిర్వహించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి డిఎన్‌విడి.ప్రసాద్ పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక సిఐటియు కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు ఆర్.లింగరాజు అధ్యక్షత జరిగిన జిల్లా కమిటీ విస్తృత సమావేశంలో మేడే పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ మేడే స్ఫూర్తితో కార్మిక హక్కుల సాధనకు ఐక్యంగా ఉద్యమించాలన్నారు. 8 గంటల పని- కార్మికుల హక్కు అనే నినాదంతో మేడేను పెద్దఎత్తున నిర్వహించనున్నట్లు తెలిపారు. మోడీ ప్రభుత్వం అప్రజాస్వామికంగా లేబర్ కోడ్స్‌ను అమలు చేసేందుకు ప్రయత్నిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వరంగ సంస్థలను ప్రయివేటుపరం చేస్తూ దేశ సంపదను అంబానీ, అదానీలకు దోచిపెడుతుందని విమర్శించారు. మేడే సందర్భంగా జిల్లావ్యాప్తంగా ప్రదర్శనలు, సభలు, జెండావిష్కరణలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు జి.రాజు, ఎం.నాగమణి, బి.సోమయ్య, వివిఎన్.ప్రసాద్, కె.పోశమ్మ, ఎన్.రమణరావు, ఆర్‌విఎస్.నారాయణ, వై.సాయికిరణ్, కె.విజయలక్ష్మి, లోకేశ్వరి, తులసి, ఎస్.రాంబాబు, కెవికెఎస్.ప్రసాద్ పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరించిన సిఐటియు జిల్లా నేతలు

నిరుపేదలపై.. నియంత పాలన

- పేదల పొట్ట కొట్టి భూస్వాములకు పెట్టడమేనా పి-4 అంటే
- విధ్వంసం, అరాచక పాలనలో కలెక్టర్, ఎస్‌పి మిగిలిన అధికారులకూ భాగస్వామ్యం
- నెల రోజుల్లో కూల్చిన ఇళ్లను పునఃనిర్మించాలి
- భూస్వాముల ఆధీనంలోని భూములు పేదలకు పంచాలి
- లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉండి ఎంఎల్‌ఎ భాగోతాన్ని బయట పెడతాం
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు
- పాలకోడేరు ఎఎస్‌ఆర్ నగర్ వాసులకు సిపిఎం రాష్ట్ర నేతల పరామర్శ
- మగ పోలీసులు ఎక్కడ పడితే అక్కడ తాకి కొట్టారంటూ రోదించిన మహిళలు



సిపిఎం నేతలకు తమ కష్టాన్ని చెప్పుకుంటున్న బాధిత మహిళలు

ప్రజాశక్తి - భీమవరం

ఉండి నియోజకవర్గంలో రాక్షస రారాజు రాజ్యం (ఆర్‌ఆర్‌ఆర్) రాజ్యమేలుతుందని, నిరుపేదలపై నియంత పాలన జులుం విదుల్చుతోందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు విమర్శించారు. నియోజకవర్గంలో మూడు నెలల కాలంలో వెయ్యి మంది నిరుపేదల ఇళ్లను అత్యంత కిరాతకంగా కూల్చేయడం అన్యాయమన్నారు. విధ్వంసం, అరాచక పాలనలో జిల్లా కలెక్టర్, ఎస్‌పితోపాటు మిగిలిన అధికారులూ భాగస్వాములుగా ఉన్నారని ఆరోపించారు. నెల రోజుల సమయంలో కూల్చిన చోటే పేదల ఇళ్లు పునఃనిర్మించడంతోపాటు భూస్వాముల ఆధీనంలో ఉన్న ప్రభుత్వ స్థలాన్ని స్వాధీనం చేసుకుని పేదలకు పంచాలని, లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా కూటమి ప్రభుత్వం, ఎంఎల్ఎ భాగోతాన్ని బయట పెడతామని హెచ్చరించారు. పాలకోడేరు ఎఎస్‌ఆర్ నగర్‌లో సిపిఎం రాష్ట్ర బృందం మంగళవారం పర్యటించింది. కూల్చేసిన ఇళ్లను పరిశీలించి, బాధితులను పరామర్శించారు. ఈ సందర్భంగా బాధితులు శని, ఆదివారాల్లో సాగిన దౌర్జన్యకాండ వివరాలను సిపిఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావుకు వివరించి కన్నీటి పర్యంతమయ్యారు. తన ఉన్న ఇద్దరు కుమార్తెలకు అంగవైకల్యం ఉందని, ఈ ఇల్లు తప్ప వేరే ఆధారం లేదని గుడాల లక్ష్మి భోరున విలపించింది. తనకు ఇద్దరు ఆడపిల్లలేనని, ఉన్న ఇంటిని నిర్దాక్షిణ్యంగా కూల్చేయడంతో వేరే వాళ్ల ఇంటి ఆవరణలో ఉయ్యాల కట్టి దానిలో చంటి బిడ్డను ఉంచానని బచ్చిక పార్వతి కన్నీరుమున్నీరైంది. మరో రెండు రోజుల్లో మీ ఇంటిని తొలగిస్తున్నామని నోటీసులివ్వడానికి విఆర్ఒ, పంచాయతీ కార్యదర్శి వచ్చారని, ఇంటి ఆవరణలో కూరగాయలు కోస్తున్న తన భార్య లక్ష్మి అధికారులు చెప్పిన మాట విని స్పృహ తప్పి పడిపోయి మృతి చెందిందని భర్త మెట్ట లక్ష్మీనారాయణ ఆవేదన వ్యక్తం చేశారు. బాధిత మహిళలు ఈశ్వరి, అన్నపూర్ణ, వెంకటలక్ష్మి, బుల్లెమ్మ, పార్వతి, సావిత్రి, భారతి, సత్యవతి, చిన్నమ్మ మాట్లాడుతూ మగ పోలీసులు ఎక్కడబడితే అక్కడ చేతులు వేసి కొట్టారని వాపోయారు. ఇంట్లో సామాన్లు తీసుకుంటామన్నా వినకుండా మీ దిక్కున చోట చెప్పుకోండని పోలీసులు దౌర్జన్యం చేసి ఇళ్లు కూలగొట్టారన్నారు. ఈ శిథిలాల మధ్యనే పాముల భయంతో రాత్రుళ్లు నిద్ర లేకుండా గడుపుతున్నామని చెప్పారు. విద్యుత్ సౌకర్యం లేదని, వద్ధులు చిన్నారులు తీవ్ర అవస్థలు పడుతున్నారని తెలిపారు. ఎక్కడ వండుకోవాలో, ఎక్కడ పడుకోవాలో కూడా తెలియని పరిస్థితిలో ఉన్నామని కంటతడి పెట్టారు. ప్రతి ఇంటినీ పరిశీలించి బాధితులను పరామర్శించారు. భూస్వాములు ఆక్రమించుకున్న ప్రభుత్వ భూమిని, ప్రభుత్వ సర్వే రాళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభకు సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్ అధ్యక్షత వహించగా శ్రీనివాసరావు మాట్లాడారు. అల్లూరి సీతారామరాజును బ్రిటీష్ వారు చంపితే ఎంఎల్ఎ రఘురామకృష్ణంరాజు అల్లూరి సీతారామరాజు నగర్‌లో పేదలకు అన్యాయం చేసి అల్లూరికి వెన్నుపోటు పొడిచారని విమర్శించారు. పేదలు, ఒంటరి మహిళలు, వృద్ధులు, బాలింతలపై ఎంఎల్ఎ రఘురామకృష్ణరాజు విధ్వంసానికి పాల్పడ్డారన్నారు. మహిళలను ఎక్కడపడితే అక్కడ తాకి మగ పోలీసులు కొట్టడం సిగ్గుచేటన్నారు. మానవ హక్కుల సంఘాలకు ఈ ఘటనను నివేదిస్తామని, అలాగే కోర్టు ధిక్కరణ కేసు కూడా పెడతామని తెలిపారు. బ్యాంకులకు డబ్బులు ఎగ్గొట్టిన ఉండి ఎంఎల్ఎ, డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామకృష్ణరాజు ఇప్పుడు నీతులు చెబుతున్నారని, ఆ పదవికి ఆయన అనర్హుడని చెప్పారు. భూస్వాముల ఆధీనంలో ఉన్న భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని లేనిపక్షంలో తామే స్వాధీనం చేసుకుని పేదలకు పంచుతామని చెప్పారు. నెల రోజుల్లో కూల్చిన ఇళ్లను పున:నిర్మించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా అన్ని రాజకీయ పక్షాలు, ప్రజా సంఘాలను సమీకరించి ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర సీనియర్ నేత మంతెన సీతారాం, జిల్లా నేతలు బి.వాసు దేవరావు, జుత్తిగ నరసింహమూర్తి, దూసి కళ్యాణి, మామిడిశెట్టి రామాంజనేయులు, కె.క్రాంతి బాబు, ధనికొండ శ్రీనివాస్, కె.తవిటినాయుడు, మండల కార్యదర్శి శేషపు అశ్రియ్య పాల్గొన్నారు.

ఎంఎల్ఎకు ఇళ్లు కూల్చే శాఖ ఏమైనా ఇచ్చారా.. ★ ★ ★

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.బలరాం

ఉండి ఎంఎల్ఎ రఘురామకృష్ణరాజుకు ఇల్లు కూల్చేసే మంత్రి పదవి ఏమైనా ఇచ్చారా. లేక లైసెన్సు ఇచ్చారా. పేదల ఇళ్లు కూలుస్తుంటే చంద్రబాబుకు, పవన్ కళ్యాణ్‌కు కనిపించట్లేదా. లేక వీటిని సమర్థిస్తున్నారా. ప్రజలకు మీరే సమాధానం చెప్పాలి. ఎఎస్‌ఆర్ నగర్‌లో ఇంత దుర్మార్గం జరుగుతుంటే ఐఎఎస్, ఐపిఎస్‌లు కనీసం స్పందించకపోవడం దారుణం. భూస్వాములు ఎకరాలు ఎకరాలు ఆక్రమించుకుంటే పట్టించుకోరు. నిరుపేద సెంటు భూమిలో గుడిసె నిర్మించుకుంటే తొలగిస్తున్నారు. ఇదేనా న్యాయం. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పి4 ఉండి నియోజకవర్గంలో రివర్స్‌లో అమలవుతుంది. సంపన్నుల సహకారంతో పేదలను అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి చెబుతుంటే, ఇక్కడ మాత్రం పేదలను కొట్టి సంపన్నులకు ఆస్తులను కట్టబెడుతున్నారు. అసెంబ్లీ కల్చరల్ ప్రోగ్రాంలో వేసిన దుర్యోధన పాత్రని నియోజకవర్గంలో ఎంఎల్ఎ అమలు చేస్తున్నారు. ఓట్లు కొనుక్కున్నాను.. నా ఇష్టమని చెబుతున్నారు. మరి ఓట్లు అడిగే ముందు ఈ విషయం చెబితే బాగుండును.

పేదలకు భూమి పంచే వరకూ ఉద్యమం.. ★ ★ ★

వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బారావు

భూస్వాములు చేతుల్లో ఉన్న ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకుని పేదలకు పంచకపోతే మరో భూపోరాటానికి సిద్ధమవుతాం. పేదల గుడిసెలు మాత్రమే అధికారులకు, ఎంఎల్ఎకు కన్పించాయా, భూస్వాముల చేతుల్లో ఉన్న వందలాది ఎకరాలు మీకు కన్పించవా అని ప్రశ్నించారు. భూస్వామ్య భావజాలంతో రఘురామకృష్ణరాజు అహంకారపూరిత పాలన చేస్తున్నారని, తగిన మూల్యం రాష్ట్ర ప్రభుత్వం చెల్లించక తప్పదని హెచ్చరించారు.

గోదావరి జలాల సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ లీకేజీ

48 గంటల్లో పూర్తిగా అరికడతాం : మరియన్న

ఏలూరు సిటీ : దెందులూరు సమీపంలో ఉన్న ఏలూరు గోదావరి జలాల సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ లీకేజీ కేవలం చుట్టూతా ఉన్న చెట్లవేళ్లు రివిటింగ్ లోపలకు చొచ్చుకుపోవడం కారణంగా అడుగు వెడల్పున రంధ్రం ఏర్పడి లీకేజీ అవుతుందని, 48 గంటల్లో పూర్తిగా లీకేజీని అరికడతామని పబ్లిక్ హెల్త్ ఇఎన్‌సి మరియన్న, ఏలూరు ఎంఎల్ఎ బడేటి రాధాకృష్ణయ్య, మేయర్ నూర్జహాన్ పెదబాబు అన్నారు. సోమవారం తెల్లవారుజాము నుంచి ఎస్ఎస్ ట్యాంక్ నుంచి వాటర్ లీకేజీ అవుతున్న సంగతి తెలిసిందే. విషయం తెలిసిన వెంటనే ఎంఎల్ఎ బడేటి రాధాకృష్ణయ్య, మేయర్ నూర్జహాన్ పెదబాబు ఆదేశాలతో కమిషనర్ ఎ.భానుప్రతాప్, ఎంఇ సురేంద్రబాబు లీకేజీ అరికట్టడానికి యుద్ధప్రాతిపాదికన చర్యలు చేపట్టారు. వందలాది మంది కూలీలు, మున్సిపల్ సిబ్బంది, జెసిబిలు, ఇసుక, గ్రావెల్, పరదాలు, మొదలగు వాటిని ఉపయోగించి మంగళవారం తెల్లవారుజామున లీకేజీ ఉధృతిని పూర్తిగా తగ్గించారు. మంచినీటి సమస్య తీవ్రతను గుర్తించి పబ్లిక్ హెల్త్ ఇఎన్‌సి మరియన్న, ఎస్‌సిలు సుధాకర్, పాండురంగారావులు మంగళవారం ఉదయం ఎస్ఎస్ ట్యాంక్ సందర్శించారు. లీకేజీని పరిశీలించిన అనంతరం వారు మాట్లాడుతూ ఎస్ఎస్ ట్యాంకుకు ఎటువంటి ప్రమాదము లేదన్నారు. సుమారు వందమంది కూలీలు షిఫ్టులు వారీగా 24 గంటలు, రెండు రోజులు పని చేయవలసి ఉంటుందన్నారు. డిప్యూటీ మేయర్ పప్పు ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలులో రైతులను ఇబ్బంది పెట్టొద్దు

ఎపి రైతుసంఘం ఆధ్వర్యాన నిరసన

ప్రజాశక్తి - భీమడోలు

ధాన్యం సేకరణలో టార్గెట్ల పేరున రైతులను ఇబ్బందులు పెట్టడం తగదని ఎపి రైతుసంఘం కోరింది. సంఘం జిల్లా అధ్యక్షులు కట్టా భాస్కరరావు, కార్యదర్శి కె.శ్రీనివాస్ ఆధ్వర్యంలో నాయకులు మండలంలో మంగళవారం పర్యటించారు. గుండుగొలను, పాతూరు, భీమడోలు ప్రాంతాల్లో కళ్ళాలలో ధాన్యాన్ని ఆరబెట్టుతున్న రైతులను కలిశారు. గుండుగొలనులో రైతులతో కలిసి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు పండించిన ప్రతి గింజనూ ప్రభుత్వం కొనుగోలు చేయాలని కోరారు. అవసరమైన గోనె సంచులను సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. కౌలు రైతుల నుంచి ధాన్యాన్ని కొనాలని కోరారు. అమ్మకానికి సిద్ధంగా ఉన్న ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు గోనె సంచులు సరఫరా చేయటం లేదన్నారు. అకాల వర్షాలు వస్తే ధాన్యం తడిచిపోయి రైతులు నష్టపోయే అవకాశం ఉందన్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు రైతులకు అవసరమైన గోనెసంచులను సరఫరా చేయటంతోపాటు, కొనుగోళ్లను వేగవంతం చేయకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో రైతు ప్రముఖులు బి.నాగేంద్ర, సిహెచ్.రమణ, జి.దుర్గారావు, ఎం.శ్రీనివాసరావు, పి.రాము పాల్గొన్నారు.



నినదిస్తున్న రైతులు, నేతలు

సాక్షి కార్యాలయం వద్ద 'చింతమనేని' ఆందోళన

తనపై వచ్చిన వార్తకు సంజాయిషీ చెప్పాలంటూ నిరసన

ఏలూరు ప్రతినిధి : ఏలూరు ఎన్‌ఆర్‌పేటలోని సాక్షి పత్రికా కార్యాలయం వద్ద దెందులూరు ఎంఎల్‌ఎ చింతమనేని ప్రభాకర్ మంగళవారం ఆందోళనకు దిగారు. సాక్షి పత్రికలో తనపై వచ్చిన వ్యతిరేక వార్తపై ఆయన తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. తనకు సంబంధంలేని అంశంలో తన గురించి ఎందుకు రాశారో సంజాయిషీ చెప్పాలంటూ పట్టుబట్టారు. చింతమనేనితోపాటు పెద్దఎత్తున ఆయన అనుచరగణం హల్‌చల్ చేసిన పరిస్థితి సాగింది. భారీగా మోహరించిన పోలీసులు చింతమనేని అనుచరులను అడ్డుకునే ప్రయత్నం చేశారు. అయినప్పటికీ కొంతమంది అనుచరగణం సాక్షి కార్యాలయంలోకి దూసుకెళ్లారు. కంప్యూటర్లు ధ్వంసం చేసినట్లు తెలుస్తోంది. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం రెండుగంటల వరకూ ఆందోళన సాగింది. సాక్షి బ్యూరోతో చింతమనేని ఫోన్లో మాట్లాడారు. తనపై రాసిన వార్తకు నేరుగా వచ్చి సమాధానం చెప్పాలంటూ పట్టుబట్టారు. సాక్షి సిబ్బంది సర్దిచెప్పే ప్రయత్నం చేసినప్పటికీ ఆయన వినిపించుకోలేదు. జిల్లా ఎస్‌పి సైతం చింతమనేనితో ఫోన్లో మాట్లాడి ఆందోళన విరమించాలని కోరినట్లు తెలిసింది. ఏలూరు ఎంఎల్‌ఎ బడేటి చంటి జోక్యం చేసుకుని సాక్షి సిబ్బందితో మాట్లాడారు. బడేటి చంటి జోక్యంతో చింతమనేని ప్రభాకర్ వెనక్కి తగ్గి ఆందోళన విరమించారు. సమస్య ఏదైనా ఉంటే చట్టప్రకారం వెళ్లాలేగాని, ఈ విధంగా పత్రికా కార్యాలయాలపై దాడులు చేయడం ఏవిధంగానూ సమంజసం కాదనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది.

ప్రమోషన్లు కల్పించాలని డిఆర్‌ఒకు వినతి

ఏలూరు అర్బన్ : ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో పనిచేస్తున్న గ్రేడ్-1 గ్రామ రెవెన్యూ అధికారులకు సీనియర్ అసిస్టెంట్ ప్రమోషన్లు వెంటనే కల్పించాలని, అలాగే గ్రేడ్-2 విఆర్‌ఒలకు గ్రేడ్-1 విఆర్‌ఒలుగా ప్రమోషన్లు కల్పించాలని కోరుతూ గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టరేట్‌లో డిఆర్‌ఒ విశ్వేశ్వరరావును కలిసి వినతిపత్రం అందజేశారు. సానుకూలంగా స్పందించిన జిల్లా రెవెన్యూ అధికారి తొందరలోనే ప్రమోషన్ల విషయంలో న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షులు భూపతిరాజు రవీంద్ర రాజు, రాష్ట్ర ఉపాధ్యక్షులు మిరియాల లక్ష్మీనారాయణ, జిల్లా అధ్యక్షులు శ్రీరామచంద్రమూర్తి, జిల్లా నాయకులు అజయ్ పాల్గొన్నారు.

మృతురాలి కుటుంబానికి ఆర్థిక సాయం

ముదినేపల్లి : మండలంలోని సంకర్షణపురం గ్రామానికి చెందిన రేమల్లి రోజానమ్మ(75) నిరుపేద వృద్ధురాలు అనారోగ్య సమస్యలతో బాధపడుతూ మంగళవారం మృతిచెందింది. ఈ విషయం తెలుసుకున్న అమరావతి బ్రాండ్ అంబాసిడర్ అంబుల వైష్ణవి మృతురాలి కుటుంబానికి ఆర్థిక సాయం అందించారు. తన తండ్రి డాక్టర్ మనోజ్ ద్వారా రూ.5 వేల నగదు, నిత్యవసర సరుకులు అందించారు. దీంతో డాక్టర్ మనోజ్ గ్రామానికి వెళ్లి మృతదేహాన్ని సందర్శించి, కుటుంబ సభ్యులను పరామర్శించి నగదును అందించారు.

ఆర్‌జియుకెటిలో ఐరన్ మాత్రల పంపిణీ

నూజివీడు టౌన్ : ఆర్‌జియుకెటి నూజివీడ్ క్యాంపస్‌లో గల క్లినిక్ విభాగం, క్యాంపస్ నిర్వహణ విభాగం సంయుక్తంగా హిమోగ్లోబిన్ లోపం ఉన్న విద్యార్థులకు ఐరన్ మాత్రలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్‌జియుకెటి రిజిస్ట్రార్, ఆర్‌జియుకెటి నూజివీడు క్యాంపస్ డైరెక్టర్ ప్రొఫెసర్ అమరేంద్ర కుమార్ పాల్గొని విద్యార్థులకు మాత్రలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన సుమారు 7 వేల టాబ్లెట్స్ అందజేసిన ఏలూరు డిప్యూటీ డిఎంహెచ్ఒకి, ఆర్‌జియుకెటి క్లినిక్ సిబ్బందికి, ఫార్మసిస్ట్ విజయ్ బాబుకు కృతజ్ఞతలు తెలిపారు. పరిపాలనాధికారి డాక్టర్ బి.లక్ష్మణరావు మాట్లాడుతూ విద్యార్థులు తమ ఆరోగ్యంపై జాగ్రత్తగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో క్యాంపస్ నిర్వహణ ఇన్‌ఛార్జి డాక్టర్ ఓ.శ్రీహరి, డిఎస్‌డబ్ల్యు(బాయ్స్) డాక్టర్ జె.సీతాపతి రావు, డిఎస్‌డబ్ల్యు(గర్ల్స్) డాక్టర్ టి.దుర్గ భవాని, ఆర్‌జియుకెటి నూజివీడు క్యాంపస్ క్లినిక్ డాక్టర్లు, చీఫ్ వార్డెన్స్ డాక్టర్ పి.లక్ష్మణరావు, డాక్టర్ కె.గౌతమి, అసోసియేట్ డీన్స్, పిఆర్ఓ, డాక్టర్ గణేష్, ఫార్మాసిస్ట్ విజయ్‌బాబు, ఇతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

'నవోదయ 2.0'పై అవగాహన

ద్వారకాతిరుమల : మండలంలోని ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ, పోలీస్, రెవెన్యూ, ఐసిడిఎస్, వెలుగు శాఖ ఆధ్వర్యంలో స్థానిక మండల ద్వాక్రా కార్యాలయంలో హ్యూమన్ డవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌లో భాగంగా నాటుసారాయి రహిత ఆంధ్రప్రదేశ్ నిర్మించడానికి ప్రభుత్వం ప్రవేశపెట్టిన నవోదయ 2.0 కార్యక్రమంపై అవగాహన కల్పించారు. భీమడోలు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ ఆధ్వర్యంలో ద్వాక్రా మహిళలకు, ఆరోగ్య శాఖ వారికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రొహిబిషన్, ఎక్సైజ్ సిబ్బంది వెలుగు శాఖ ఏపిఎం అరవిందమ్మ, హెచ్‌డి సీసీ గౌరీశంకర్, విఒఎలు పాల్గొన్నారు.

ఉర్దూ పండిట్ పోస్టు మంజూరుకు వినతి

కలిదిండి: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉర్దూ సబ్జెక్టు బోధించుటకు ఉర్దూ పండిట్ పోస్టు మంజూరు చేయాలని గ్రామస్తులు కోరారు. ఈ సందర్భంగా వారు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి.స్వర్ణకుమారికి తమ సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. మాజీ ఎంపిటిసి ఎండి బషార్ తుల్లా, మండల ఐటిడిపి కో ఆర్డినేటర్ అబ్దుల్ అస్లామ్, గ్రామస్తులు ఫిరోజ్ ఖాన్, మునాఫ్, అబ్దుల్లా, ఉపాధ్యాయులు ఎన్.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

గోదావరి మ్యాథ్స్ ఒలింపియాడ్‌లో త్రివిధ విద్యార్థుల ప్రతిభ

నూజివీడు టౌన్ : డిసెంబర్‌లో నిర్వహించిన గోదావరి మ్యాథ్స్ ఒలింపియాడ్, తెలుగు రామాయణం, హిందీలో ప్రతిభ చూపి రాష్ట్ర, జిల్లా స్థాయిలో ర్యాంక్‌లు సాధించిట్లు త్రివిధ విద్యాసంస్థల అధినేత సబినేని శ్రీనివాస్ తెలిపారు. బి.పూర్వి ఏడవ తరగతి రాష్ట్రస్థాయి మూడో ర్యాంక్, డి.సుమతి ఏడవ తరగతి రాష్ట్రస్థాయి ఆరవ ర్యాంకు, ఎన్.శరణ్య ఏడవ తరగతి రాష్ట్రస్థాయి ఆరవ ర్యాంక్, కె.దివిజ ఏడవ తరగతి రాష్ట్రస్థాయి ఆరవ ర్యాంకు, శివ లాస్య ప్రియ ఏడవ తరగతి రాష్ట్రస్థాయి ఆరవ ర్యాంక్, కె.జాహ్నవి ఏడవ తరగతి రాష్ట్రస్థాయి ఆరవ ర్యాంక్, పి.యాషిక ఏడవ తరగతి రాష్ట్రస్థాయి ఆరవ ర్యాంక్, కె.జనతా లక్ష్మి రాష్ట్రస్థాయి ఆరవ ర్యాంకు, ఎం.జ్ఞాన అక్షయ ఏడవ తరగతి రాష్ట్రస్థాయి ఆరవ ర్యాంకు, పి.భూషన్ సాయి ఏడవ తరగతి రాష్ట్రస్థాయి ఆరవ ర్యాంకు, జె.పరంజ్యోతి ఏడవ తరగతి రాష్ట్రస్థాయి ఆరవ ర్యాంకు, కె.కేతన సాయి ప్రియ 8వ తరగతి రాష్ట్రస్థాయి రెండవ ర్యాంకు, జి.దీక్షిత ఎనిమిదవ తరగతి రాష్ట్రస్థాయి రెండవ ర్యాంకు, ఎన్.ధనుష్ ఆరవ తరగతి రాష్ట్రస్థాయి రెండవ ర్యాంక్, సిహెచ్.నాగ విజయ ఆరవ తరగతి స్టేట్ ఫస్ట్ ర్యాంక్ సాధించారని అన్నారు.

నిబంధనలు పాటించకపోతే కఠిన చర్యలు


నూజివీడు టౌన్ : మండలంలోని అన్నవరం గ్రామంలో ప్రాంతీయ రవాణా అధికారి నాగ మురళి ఆదేశానుసారం ప్రాంతీయ ఉప రవాణా అధికారి కృష్ణవేణి మంగళవారం వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కృష్ణవేణి మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలన్నారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనం నడపడం చట్టరీత్యా నేరం అన్నారు. మైనారిటీ తీరకుండా వాహనం నడిపితే వాహన యజమాని, మైనారిటీ తీరని చిన్నారుల తల్లిదండ్రులు కఠిన శిక్షలు, భారీ జరిమానాలు కట్టవలసి వస్తుందన్నారు. వాహనంతో పాటు అన్ని రకాల ధ్రువీకరణ పత్రాలు వెంట ఉండాలన్నారు. అన్ని నిబంధనలను ప్రభుత్వం కఠిన తరం చేసినట్లు వివరించారు. నిబంధనలు అతిక్రమిస్తే భారీ జరిమానాలు, కఠిన చర్యలు తప్పవు అన్నారు. ఈ తనిఖీలో భాగంగా సరైన ధ్రువపత్రాలు లేని కారణంగా రూ.30 వేల జరిమానాలు విధించినట్లు కృష్ణవేణి తెలిపారు.

మతిస్థిమితం లేని మహిళను రక్షించిన పోలీసులు

ఏలూరు స్పోర్ట్స్ : అనారోగ్య పరిస్థితులతో ఆమె మతిస్థిమితం కోల్పోయింది. మందులు వాడుతున్నప్పటికీ ప్రయోజనం కలగలేదు. అందరూ నిద్రించిన సమయంలో ఆమె ఇంటి నుండి బయటకు వచ్చి రైలు పట్టాలపై ఒంటరిగా నిలబడి ఉండడాన్ని గమనించిన రైల్వే పోలీసులు ఆమెను రక్షించి బంధువులకు అప్పగించిన ఘటన ఏలూరు నగరంలోని పెద్ద రైల్వే స్టేషన్‌లో మంగళవారం చోటుచేసుకుంది. ఏలూరు రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఏలూరు నగరంలోని ఏసుపాదపురం ప్రాంతానికి చెందిన లలిత కుమారికి అదే ప్రాంతానికి చెందిన వ్యక్తితో వివాహం జరిగింది. గత కొంతకాలంగా ఆమె అనారోగ్యంతో బాధపడుతుంది. మానసిక స్థితి సరిగ్గా లేకపోవడంతో దానికి సంబంధించిన మందులు కూడా ఆమె వాడుతుంది. మరేం జరిగిందో ఏమో తెలియదు కానీ మంగళవారం తెల్లవారుజామున ఏలూరు పెద్ద రైల్వే స్టేషన్‌లోని ప్లాట్‌ఫామ్ నెంబర్ 2, 3 మధ్యలో రైలు పట్టాలపై నిలబడి ఉందన్న సంగతి ప్రయాణికులు రైల్వే పోలీసులకు తెలియజేశారు. వెంటనే స్పందించిన జిఆర్‌పిఆర్‌పిఎఫ్ పోలీసులు సంయుక్తంగా ఆమెను రక్షించి ఆమె బంధువులకు ఫోన్లో సమాచారం ఇచ్చారు. ఆమె సోదరుడుకి ఆమెను అప్పగించారు. అలాగే ఆమె భర్తకు కూడా విషయాన్ని ఫోన్ ద్వారా తెలియజేశారు. ఆమె సోదరుడికి రైల్వే పోలీసులు కౌన్సిలింగ్ ఇచ్చారు. అనంతరం ఆమెను ఆమె సోదరుడితో పంపారు. విషయం తెలుసుకున్న వెంటనే స్పందించి మహిళలను రక్షించిన రైల్వే పోలీసులకు ప్రయాణికులు కృతజ్ఞతలు తెలిపారు.

విద్యుత్ కోతలతో అల్లాడుతున్న జనం

పడిపోయిన టవర్‌ను పునరుద్ధరించని వైనం
రోజుకు 6 గంటలు కోతలు


నీటిలో పడిపోయిన టవర్

ప్రజాశక్తి - ముదినేపల్లి


మండల ప్రజలు విద్యుత్ కోతలతో అల్లాడుతున్నారు. ఒకపక్క ప్రజలు, మరో పక్క ఆక్వా రైతులు విద్యుత్ కోతల కారణంగా నానా అవస్థలు పడుతున్నారు. గత పది రోజుల కితం మండలంలో వీసిన భారీ గాలులకు 132 కెవి సబ్ స్టేషన్ నుంచి చిగురుకోటనకు వచ్చే రెండు టవర్స్‌లో ఒక టవర్ మండవల్లి మండలం పుట్లచెరువు గ్రామ పరిధిలోని ఆక్వా చెరువులో పడిపోయింది. టవర్ చెరువులో పడి పది రోజులు గడుస్తున్నా అధికారులు తిరిగి టవర్‌ను పునరుద్ధరించలేదు. దీంతో మండలంలోని మూడు సబ్ స్టేషన్ల పరిధిలో గత పది రోజులుగా విద్యుత్ కోతలు విధించడంతో ఆక్వా రైతులు, గ్రామీణ ప్రాంత జనం అల్లాడిపోతున్నారు. పడిన టవర్ సరిచేసేందుకు మూడు రోజుల సమయం పడుతుందని విద్యుత్ శాఖాధికారులు అప్పట్లో చెప్పినప్పటికీ నేటికీ సరిచేయలేదు. పడిపోయిన టవర్ చెరువు నీటిలోనే ఉండిపోయింది. దీంతో మండలంలోని సింగరాయపాలెం, కొత్తపల్లి, చిగురుకోట సబ్ స్టేషన్ల పరిధిలోని సుమారు 20 గ్రామాల ప్రజలు నిరంతరం విద్యుత్ కోతలతో నానా యాతనలు పడుతున్నారు. ఈ 20 గ్రామాల్లో రాత్రి తొమ్మిది గంటల నుంచి 11 గంటల వరకు, తెల్లవారుజామున ఐదు గంటల నుంచి ఉదయం ఏడు గంటల వరకు, పగలు మరో రెండు గంటల పాటు మొత్తం రోజులో ఆరు గంటల పాటు విద్యుత్ కోతలు విధిస్తున్నట్లు ఆయా గ్రామాల ప్రజలు చెబుతున్నారు. టవర్ ఆక్వా చెరువులో పడి పది రోజులు గడిచినా అధికారులు టవర్‌ను తిరిగి సరి చేయకపోవడంపై అటు ప్రజలు, ఇటు రైతులు అధికారుల పనితీరుపై ఆగ్రహావేశాలు వ్యక్తం చేస్తున్నారు. అసలే వేసకాలంతో అల్లాడుతున్న ప్రజలకు విద్యుత్ కోతలు మరింత ఇబ్బందికరంగా మారాయి. విద్యుత్ కోతల కారణంగా ఆక్వా రైతులు జనరేటర్లకు డీజిల్ కొనుగోలు చేసి ఆక్వా రైతులు ఏరియేటర్లు తిప్పుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే చెరువులో పడిపోయిన టవర్‌ను తిరిగి పునరుద్ధరించి విద్యుత్ కోతలు లేకుండా చూడాలని మండల ప్రజలు ముక్తకంఠంతో అధికారులను కోరుతున్నారు.

పనుల పరిశీలన

ప్రజాశక్తి - దెందులూరు

పెదవేగి గ్రామ పంచాయతీలో జరుగుతున్న స్వచ్ఛంద పనులను సర్పంచి తాతా శ్రీరామమూర్తి, కార్యదర్శి కె.వరప్రసాద్ మంగళవారం పరిశీలించారు. పెదవేగిలో ప్రధాన రహదారి వెంట ఉన్న చెత్తను తొలగింప జేశారు. చెత్తను తగలబెట్టించి రాహదారి మార్జిన్ లను శుభ్రం చేయించారు. రహదారిలో ఉన్న మట్టి దిబ్బలను తవ్వి ట్రాక్టర్ ద్వారా తరలిస్తున్నారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

వేగివాడ పంచాయతీ పరిధిలో ఉన్న వేగివాడ నుంచి కె.కన్నాపురం వెళ్లే ప్రధాన రహదారి తుప్పలతోను, ముళ్ల కంచెలతోను మూసుకుపోయింది. ఈ రహదారిలో ఉన్న తుప్పలను జెసిబి సాయంతో తొలగించారు. అనంతరం రహదారి అభివృద్ధి పనులను గ్రామసర్పంచి పంది ప్రభావతి, గ్రామ కార్యదర్శి బాబ్జి పర్యవేక్షించారు.


కలిదిండిలో ట్రై సైకిళ్లు పంపిణీ చేస్తున్న ఎంపిపి

ప్రత్యేక అవసరాల పిల్లలకు ఉపకరణాల పంపిణీ

కలిదిండి : వైకల్యాలను అధిగమించి విద్యార్థులు విద్యలో రాణించాలని ఎంపిపి చందన ఉమామహేశ్వరరావు అన్నారు. స్థానిక భవిత ఎంపియుపి పాఠశాలలో ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులకు ట్రై సైకిళ్లు, వినికిడి పరికరాలు, బ్రెయిలీ కిట్స్‌ను ఆయన పంపిణీ చేశారు. ఎంఇఒ వెలమల శ్రీనివాసరావు, హెచ్‌ఎం సనావుల్లా, ఐఆర్‌టిలు నాగరాజు, గోపాలకృష్ణ, ఫిజియోథెరఫిస్ట్ సునీత, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

చింతలపూడి : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాకా ప్రయివేటు స్కూళ్లకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు ఉండాలని కృషి చేస్తూ ఆవిధంగా ముందుకు సాగుతోందని మాజీ ఎఎంసి ఛైర్మన్ జగ్గవరపు ముత్తారెడ్డి అన్నారు. మండలంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏలూరు జిల్లా విద్యాశాఖ, సమగ్ర శిక్ష వారి ఆధ్వర్యంలో ప్రత్యేక అవసరాల గల పిల్లలకు ఉచిత సహాయ ఉపకరణాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యక్రమాన్ని నిర్వహించిన ప్రతి ఒక్కరినీ అభినందించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారులు జి.రామారావు, సిఎస్.కిరణ్‌బాబు, జనసేన మండలం అధ్యక్షులు మధుబాబు, పాఠశాల హెచ్‌ఎం వి.మురళీకృష్ణ పాల్గొన్నారు. **నూజివీడు టౌన్:** నూజివీడు పట్టణంలోని ఎస్ఆర్ఆర్ జిల్లా పరిషత్ బాయ్స్ హై స్కూల్‌లో ప్రత్యేక అవసరాల గల పిల్లల ఉపకరణాలు పంపిణీ చేశారు. నూజివీడు మండలానికి సంబంధించి 26 మందికి, ముసునూరు మండలానికి 13 మందికి, చాట్రాయి మండలానికి పదిమందికి అందజేశారు. కార్యక్రమంలో ఎంఇఒ జమలయ్య, మున్సిపల్ వైస్ ఛైర్మన్ పగడాల సత్యనారాయణ, ఆరో వార్డు కౌన్సిలర్ కందుల సత్యనారాయణ పాల్గొన్నారు.


ప్రారంభమైన రోడ్డు అభివృద్ధి పనులు

వడాలి రోడ్డుకు మోక్షం.. దుమ్ముకు చెక్

ప్రారంభమైన రోడ్డు అభివృద్ధి పనులు
ప్రజాశక్తి వార్తకు స్పందన

ముదినేపల్లి : ఎట్టకేలకు అధికారులు స్పందించారు. ముదినేపల్లి-బంటుమిల్లి రోడ్డులో వడాలి వద్ద రోడ్డు అభివృద్ధి పనులు ప్రారంభించారు. మండలంలోని వడాలి నుంచి స్తంభం చెరువు వరకు రోడ్డు అధ్వానంగా మారి జనాలకు చుక్కలు చూపిస్తుంది. సుమారు మూడు కిలోమీటర్ల మేర వాహనాల రాకపోకల సమయంలో దుమ్ము, ధూళి ప్రయాణికులు, ద్విచక్ర వాహనదారులపై ఎగసిపడటంతో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. ముఖ్యంగా వడాలి సెంటర్లో దుమ్ము సమస్య మరింత ఎక్కువగా ఉంది. ఈ సమస్యపై ఈనెల 19వ తేదీ ప్రజాశక్తిలో 'అమ్మో ఆ రోడ్డుపై ప్రయాణమా' అనే శీర్షికతో వార్త వెలువడిన విషయం తెలిసిందే. స్పందించిన సంబంధిత శాఖ అధికారులు రెండు రోజుల నుంచి రోడ్డు అభివృద్ధి పనులు చేపట్టారు. యంత్రాలతో పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. గత కొన్ని నెలలుగా దుమ్ము, ధూళి సమస్యతో ఇబ్బంది పడిన ప్రజలు, వాహనదారులు రోడ్డు అభివృద్ధి పనులు జరగడంతోపాటు సమస్య తీరిందని ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

నేటి నుంచి అంతర్జాతీయ కార్యశాల

చింతలపూడి : విద్యార్థుల్లో ఆంగ్ల భాష పట్ల అవగాహన పెంచాలని, వారిని విద్య, ఉపాధి రంగాలలో ముందుకు నడిపించేందుకు ఉపయోగపడుతుందని గవర్నమెంట్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి.శ్రీనివాసరావు అన్నారు. గవర్నమెంట్ డిగ్రీ కాలేజీ చింతలపూడిలోని ఆంగ్ల శాఖ, జవహర్ నాలెడ్జ్ సెంటర్(జెకెసి) సంయుక్తంగా ఐక్యూఎసి ఆధ్వర్యంలో 'గ్లోకల్ తరం కోసం ఆంగ్ల భాష' అనే అంశంపై మూడు రోజుల అంతర్జాతీయ కార్యాశాల ఏప్రిల్ 23 నుంచి 25 వరకు నిర్వహించనున్నారు. ఈ కార్యాశాల హైబ్రిడ్ మోడ్లో జరుగుతుంది. (ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ మాధ్యమాలలో) ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దీని ముఖ్య ఉద్దేశ్యం గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు ప్రపంచస్థాయి భాషగా ఆంగ్ల భాషను నేర్పించడమే కాకుండా స్థానిక సాంస్కృతిక విలువలతో కలిపి భాషను ఉపయోగించే విధానాన్ని అవగాహన చేయడమని తెలిపారు. డాక్టర్ సయ్యద్ మీర్ హసీమ్, ఐక్యూఎసి డైరెక్టర్, కార్యాశాల కన్వీనర్ బోడా శ్రీనివాసరావు, ఆంగ్ల శాఖ విభాగాధిపతి, ఆర్గనైజింగ్ సెక్రటరీ పి.కల్పన, జెకెసి మెంటార్, కార్యశాల కో కన్వీనర్ సంయుక్తంగా ఈ కార్యాశాలను ప్రకటించారు. ఈ కార్యక్రమానికి అమెరికా, భారతదేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి రిసోర్స్ పర్సన్లు పాల్గొంటారని తెలిపారు. ఈ మూడు రోజుల కార్యక్రమంలో మాట్లాడే ఆంగ్ల భాష, డిజిటల్ కమ్యూనికేషన్, సృజనాత్మక రచన, ఉపాధికి అవసరమైన ఆంగ్ల నైపుణ్యత వంటి అంశాలపై ఆసక్తికరమైన సెషన్లు జరుగుతాయి. ఈ కార్యక్రమం విద్యార్థులకు, అధ్యాపకులకు, పరిశోధకులందరికీ ఉపయోగపడేలా ఏర్పాటు చేయబడిందన్నారు. ఈ కార్యశాలను అందరూ సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు కోరారు.

బస్ స్టేషన్‌కు వాటర్ ఫ్రీజర్ బహూకరణ

ముదినేపల్లి : ముదినేపల్లిలోని ఆర్‌టిసి బస్‌స్టాండ్‌లో వేసవిలో ప్రయాణికుల దాహార్తిని తీర్చేందుకుగాను ముదినేపల్లి ఎంపిపి రామిశెట్టి సత్యనారాయణ కూలింగ్ వాటర్ ఫ్రీజర్‌ను ఆర్‌టిసి అధికారులకు బహూకరించారు. వేసవి దృష్ట్యా ప్రయాణికులు ఎవరు తాగునీటికి ఇబ్బంది పడకూడదని కూలింగ్ వాటర్ ఫ్రీజర్‌ను ఆర్‌టిసి సంస్థకు బహూకరించారు. మంగళవారం ఉదయం ఎంపిపి సత్యనారాయణ ఏలూరు ఆర్‌టిసి సిఐ మురళీతో కలిసి బస్‌స్టాండ్‌లో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆర్‌టిసి సిఐ మురళి మాట్లాడుతూ రోజురోజుకూ ఎండలు పెరిగిపోతున్న నేపథ్యంలో ప్రజల సౌకర్యార్థం ప్రయాణికుల దాహార్తిని తీర్చేందుకు చల్లటి తాగునీటిని అందించడం పట్ల ఎంపిపిని అభినందించారు. ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్‌టిసి కాంట్రాక్టర్ కృష్ణమూర్తి, పేర్ని పృథ్వి, కంట్రోలర్ కోటేశ్వరరావు, సాగర్ పాల్గొన్నారు.


జెడ్‌పి ఉన్నత పాఠశాల సందర్శన

నూజివీడు టౌన్ : మండల పరిధిలోని గొల్లపల్లిలో గల శ్రీఅన్నే రామకృష్ణయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను జిల్లా విద్యాశాఖాధికారిణి వెంకటలక్ష్మమ్మ సందర్శించారు. గొల్లపల్లి ఎలిమెంటరీ స్కూల్ నుంచి 20 మంది విద్యార్థులు నూతనంగా ఆరవ తరగతిలోకి ప్రవేశించారు. 2025-2026 విద్యా సంవత్సరంలోకి అడుగు పెడుతున్న స్వాగతం బోర్డ్‌ను పరిశీలించి విద్యార్థుల తల్లిదండ్రులతో కాసేపు ముచ్చటించారు. అనంతరం నూతనంగా జాయిన్ అయిన విద్యార్థులకు జిల్లా విద్యాశాఖాధికారిణి చేతులమీదగా స్వీట్స్‌ను అందించారు. ప్రోగ్రస్ కార్డులను పరిశీలించి, ప్రమోషన్ లిస్టులను తయారు చేసుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో ముచ్చటించారు. తాను కష్టపడి చదివానని, మీరు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు ఎదగాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం వంట ఏజన్సీ వారితో మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలన్నారు. భోజన పదార్థాలు రుచిగా వండాలన్నారు. వండిన భోజన పదార్థాలు పరిశీలించి సంతృప్తి వ్యక్తంచేశారు. ఉపాధ్యాయుల హాజరు నమోదు పరిశీలించారు. అనంతరం ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయుడు పి.రవీంద్ర, ఉపాధ్యాయులు, నాన్ టీచింగ్ సిబ్బంది పాల్గొన్నారు.


విద్యార్థులతో డిఇఒ వెంకటలక్ష్మమ్మ

బలివేలో నీటి బావి మరమ్మతుకు చర్యలు

మంత్రి పార్థసారథి రూ.50 వేల విరాళం


రూ.50 వేలు అందజేస్తున్న మంత్రి

ప్రజాశక్తి - ముసునూరు

మండలంలోని బలివే గ్రామంలో మంగళవారం రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి పర్యటించారు. ఈ సందర్భంగా ఇటీవల మరణించిన కాట్రు గోపాలస్వామి(గురవయ్య) చిత్రపటానికి ఆయన పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం గురవయ్య కుమారుడైన కాట్రు రామస్వామిని వారి తండ్రి గోపాలస్వామి మరణం వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గోపాలస్వామి కుటుంబ సభ్యులకు మంత్రి పార్థసారథి తమ సానుభూతిని తెలియజేశారు. అనంతరం గ్రామ సమస్యలను స్థానికుల నుంచి మంత్రి అడిగి తెలుసుకున్నారు. గ్రామం చివర వున్న నీటి బావిని మరమ్మతులు చేయించాలని స్థానిక ప్రజలు కోరగా తక్షణమే తన సొంత సొమ్ము రూ.50 వేలను కాట్రు రామస్వామికి అందజేసి సదరు నీటి బావి నిర్మాణ బాధ్యతలను మంత్రి పార్థసారథి అప్పగించారు. దీంతో గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.

రష్యా విప్లవ పోరాట యోధుడు లెనిన్

జయంతి కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి


జీలుగుమిల్లి : నివాళులర్పిస్తున్న నాయకులు

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

శ్రమజీవుల సమాన హక్కుల కోసం, పీడిత ప్రజల విముక్తి కోసం పనిచేసిన వ్యక్తి లెనిన్ అని, సమాజ మార్పులు కోరుకొని రష్యా విప్లవ పోరాటానికి బాటలు వేశారని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి అన్నారు. ఐవి లెనిన్ 150వ జయంతి వేడుకల సందర్భంగా సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో ప్రజా సంఘాల కార్యాలయంలో లెనిన్ చిత్రపటానికి ఆయన పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి తెల్లం దుర్గారావు, కమిటీ సభ్యులు సిరిబత్తుల సీతారామయ్య, కారం నాగదుర్గ, కారం మల్లు దొర పాల్గొన్నారు.

టి.నర్సాపురం : మధ్యభారత అడవుల్లో ఆదివాసీలపై జరుగుతున్న దాడులను ప్రభుత్వం ఆపాలని, వారితో శాంతి చర్చలు జరపాలని ఆంధ్రప్రదేశ్ రైతుకూలి సంఘం జిల్లా కార్యదర్శి భాస్కర్ డిమాండ్ చేశారు. మండలంలోని మర్రిగూడెం గ్రామంలో మంగళవారం సత్తిరాజు స్తూపం వద్ద తొలి సోషలిస్టు సమాజ నిర్మాత విఐ లెనిన్ 155వ జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఆంధ్రప్రదేశ్ రైతు కూలిసంఘం జిల్లా కార్యదర్శి భాస్కర్ అధ్యక్షతన జెండా ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ మధ్యభారత అడవుల్లో సాగుతున్న ఖగార్ దాడికి వ్యతిరేకంగా అన్ని ప్రజా సంఘాలు కలిపి రెండు తెలుగు రాష్ట్రాల్లో శాంతి ర్యాలీ ప్రదర్శనలు, సభలు నిర్వహిస్తున్నారన్నారు. కగార్ దాడులను ఆపి శాంతి చర్చలు జరపాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సామ్రాజ్యవాద దోపిడీని ఆదివాసీలందరూ ప్రజా ఉద్యమాల ద్వారా ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డివిజన్ కార్యదర్శి బాబురావు, మండల నాయకులు కాటయ్య, నాగేశ్వరరావు, అర్జున్, కనకయ్య పాల్గొన్నారు.

గ్రామాల్లో అడ్మిషన్ల కోసం అధికారుల క్యాంపెయిన్

నూజివీడు టౌన్ : ప్రభుత్వ పాఠశాలలో ఎంతో మెరుగైన విద్య, అద్భుతమైన సౌకర్యాలు కల్పిస్తున్నాయని అధికారుల బృందం అడ్మిషన్ల కోసం గ్రామాల బాట పట్టారు. మండలంలోని దేవరగుంట గ్రామంలో డివిజినల్ ఉప విద్యాశాఖ అధికారి ఎం.సేవియా పాల్గొని మాట్లాడుతూ ప్రయివేట్, కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు అభివృద్ధి చెందాయన్నారు. ఏలూరు జిల్లాస్థాయిలో నూజివీడు ప్రాంతంలోని జెడ్‌పి హై స్కూల్స్ గొప్ప ప్రగతిని సాధించినట్లు సోదాహరణంగా వివరించారు. ప్రభుత్వ పథకాలు, సౌకర్యాలు గురించి వివరించారు. విద్యార్థులు ప్రగతి సాధించే దిశగా ప్రత్యేక శిక్షణ తరగతులు అందిస్తున్నట్లు చెప్పారు. గ్రామంలోని విద్యార్థుల తల్లిదండ్రులతో అధికారుల బృందం చర్చించారు.

పోషక విలువలతో కూడిన ఆహారమే మేలు : ఎంఎల్‌ఎ

ఏలూరు సిటీ : పోషక విలువలతో కూడిన ఆహారమే ఆరోగ్య పరిరక్షణకు కీలకమని ఏలూరు ఎంఎల్‌ఎ బడేటి చంటి సూచించారు. ఏలూరు మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో మంగళవారం పౌష్టికాహార పక్షోత్సవాల ముగింపు కార్యక్రమాన్ని లక్ష్య సాధన దిశగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏలూరు ఎంఎల్‌ఎ బడేటి చంటి, నగర మేయర్ షేక్ నూర్జహాన్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. తొలుత వారికి ఆత్మీయ స్వాగతం లభించింది. అనంతరం కార్యాలయంలో ఏర్పాటు చేసిన పౌష్టికాహారాల ప్రదర్శనను వారు తిలకించి ఆహారాన్ని స్వీకరించారు. పోషక విలువలతో కూడిన పౌష్టికాహారం చేసే మేలును వివరించారు. ఐసిడిఎస్ పిడి కె.శారద, కార్పొరేషన్ కమిషనర్ ఎ.భానుప్రతాప్, డిప్యూటీ మేయర్ పప్పు ఉమామహేశ్వరరావు, కోఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబు, పాల్గొన్నారు.

'అందరికీ ఇళ్లు'దరఖాస్తు చేసుకోండి : సబ్ కలెక్టర్

నూజివీడు టౌన్ : అందరికీ ఇళ్లు అనే కార్యక్రమం ద్వారా అర్హులైన ప్రతి కుటుంబానికి అవకాశం కల్పించేందుకు ప్రభుత్వం బృహత్తరమైన కార్యాచరణ రూపొందించినట్లు సబ్ కలెక్టర్ స్మరణ్ రాజ్ తెలిపారు. నూజివీడులో ఆయన మంగళవారం మాట్లాడుతూ అర్హులైన ప్రతి కుటుంబానికి గ్రామీణ ప్రాంతాలలో మూడు సెంట్లు, పట్టణ ప్రాంతాలలో రెండు సెంట్లు చొప్పున స్థలం కేటాయించటం జరుగుతుందన్నారు. ఇందుకోసం హౌస్ ఫర్ ఆల్ అనే పోర్టంలో అర్హులైన వారు ఆన్‌లైన్ ద్వారా అన్ని వివరాలను నమోదు చేయాలని సూచించారు. అర్హులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

సిఎం సహాయ నిధి చెక్కు అందజేత

టి.నరసాపురం : మండలంలోని వెలగపాడు గ్రామంలో ఇటీవల అనారోగ్యానికి గురైన పాకనాటి సత్యనారాయణకు మంజూరైన ముఖ్యమంత్రి సహాయ నిధి రూ.50 వేల చెక్కును టిడిపి రాష్ట్ర కార్యదర్శి శీలం వెంకటేశ్వరరావు మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో అన్ని వర్గాల ప్రజలకు మేలు జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో శీలం సాయి వినయ్, జాజుల బుచ్చిబాబు, తుమ్మా నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రకటన

మహారాజశ్రీ పాలకొల్లు ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో
ఐ.ఎ.నెం. 1249/2019 ఇన్
ఓ.యస్.నెం. 184/2018

బిట్వీన్:-
ఉమ్మిడి విజయలక్ష్మి ...వాది
మరియు
విస్సా శ్రీ అప్పాజీ వెంకట సత్యనారాయణ
మరియు 10 మంది ఇతరులు ...ప్రతివాదులు

ప్రపోస్ట్ పార్టీలు:-
1. విస్సా వెంకట లక్ష్మి, W/o. లేట్ సత్యనారాయణ మూర్తి, కుమారుల ఆధీనం, చిట్టవరం, నర్సాపురం మండలం.
2. విస్సా వెంకటేష్ బాబు, S/o. లేట్ సత్యనారాయణ మూర్తి, కుమారుల ఆధీనం, చిట్టవరం, నర్సాపురం మండలం.
3. మేడిది సీత మహాలక్ష్మి, W/o. నాగ వెంకట సత్య బలరామ క్రిష్ణ స్వామి నాయుడు, D/o. లేట్ సత్యనారాయణ మూర్తి, చిట్టవరం, నర్సాపురం మండలం.

పై నెంబరు దావాలో శ్రీ కోర్టు వారు మీకు ఎన్ని పర్యాయములు సమన్లు జారీ చేసినప్పటికి, మీరు ఉదేశపూర్వకంగా అందుకొనక కాలయాపన చేయుచున్నందున శ్రీ కోర్టు వారు ఈ పేపరు ద్వారా మీకు సమన్లు జారీ చేసియున్నారు. సదరు దావా **ది. 05-05-2025వ సం. తేదిన ఉదయం గం. 10-30 ని.లకు** వాయిదా అయివున్నది. కావున మీరు ప్రత్యక్షముగా గాని, లేదా మీ పరోక్షమున ప్లీడరు గారి ద్వారా గాని కోర్టులో హాజరు అయ్యి మీ వాదన దాఖలు చేసుకొనవలెను. లేని యెడల శ్రీ కోర్టు వారు మీ పరోక్షమున ముందు గ్రంధము జరిపెదరని యిందుమూలముగా తెలియచేయడమైనది.

పి.డి.యస్.వి.బాలాజీ బి.కామ్, బి.యల్
పాలకొల్లు న్యాయవాది,
ది.22-04-2025 పాలకొల్లు
సెల్: 94904 33732